
సాక్షి ఒడిశా

ఆదివారం । 30 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.90,026

– భువనేశ్వర్/పూరీ



కొరాపుట్ జిల్లాలో ఆంత్రాక్స్ కలకలం

కొరాపుట్ జిల్లాలోని దేవిఘట్ గ్రామ పంచాయతీ పాడాయిగుడ గ్రామంలో ఆంత్రాక్స్ కలకలం సృష్టించింది.

- 8లో



ఎరువుల కోసం రైతుల ఆందోళన

ఖరీఫ్ సీజన్‌లో సమయానికి ఎరువులు దొరక్కపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

ప్రసవ 'వే'దన



గర్భిణిని మంచంపై మోసుకెళ్తున్న దృశ్యం

రాయగడ: రహదారి సౌకర్యాలు లేకపోవడంతో ఒక నిండు గర్భిణిని మంచంపై మోసుకుంటూ తీసుకెళ్లిన మరో ఘటన కాసీపూర్ సమితిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. సమితిలోని ఒడాజొరొ పంచాయతీ కొడిపారి మోరాపాస్ గ్రామంలోని జన్నివీధిలో నివసిస్తున్న కున్ని మాఝి (22) నిండు గర్భిణి. శనివారం ఉదయం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ఆ ప్రాంతంలోని అంగన్‌వాడీ కార్యకర్త సవిత నాయక్, ఆరోగ్య కార్యకర్త సంజుక్త నాయక్‌లకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న వీరిద్దరు వెంటనే అంబులెన్స్‌కు కాల్ చేశారు. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో అంబులెన్స్ నిలపాల్సి వచ్చింది. దీంతో గత్యంతరం లేక గ్రామస్తులంతా కలిసి ఒక మంచంపై కున్నిని మోసుకుంటూ, కొండలను దాటుకుంటూ అంబులెన్స్ ఉన్న చోటుకు తీసుకెళ్లారు. వెంటనే కాసీపూర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పడంతో, వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఒక మగ శిశువుకు కున్ని జన్మనిచ్చింది.

'కొఠియా సమస్యలు పరిష్కరించండి'



కొఠియా గ్రామాల ప్రజలతో పొట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం

కొరాపుట్: కొఠియా గ్రామాల సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. శనివారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా పంచాయతీలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వివాదం లేని గ్రామాలైన పుల్‌పాదర్, తుల కొంటి, మలలాంబ, కక్కరగుడ, సలీం పొదర్ గ్రామాల ప్రజలు కొరాపుట్ తరలివచ్చారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.కీర్తివాసన్‌ను కలిసి తమ గ్రామల సమస్యలు ఏకరువు పెట్టారు. బాధిత గ్రామాలకు సరైన రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన పొట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం వారితో జత కలిశారు. ప్రభుత్వాలు కేవలం వివాదస్పద ప్రాంతాలకు అభివృద్ధి పేరిట వందల కోట్లు ఖర్చుల పెడుతున్నట్లు ప్రకటనలు చేస్తోందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదం లేని అనేక గ్రామాలు సమస్యల్లో మునిగి ఉన్నాయన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యలు పరిష్కరం చేస్తామని ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు.

ఏనుగు సంచారం



మలగుడ అడవుల్లో కనిపించిన ఏనుగు

రాయగడ: జిల్లాలో గుడారి సమితి కొరలా ఘాటి పంచాయతీలోని మలగుడ అడవుల్లో ఏనుగు సంచరిస్తోంది. శుక్రవారం రాత్రి కరలాఘాటి మీదుగా బిరిపంగ గ్రామానికి చేరుకున్న ఏనుగు అనంతరం మలగుడ అడవులకు చేరినట్లు గ్రామస్తులు తెలియజేశారు. అయితే ఒక్క ఏనుగు మాత్రమే ఈ ప్రాంతంలో సంచరిస్తుందని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టర్ దీప్తి వర్ధన్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ఏనుగు ఆచూకిని పసిగట్టేందుకు అటవీ శాఖ సిబ్బంది అడవుల్లో గాలిస్తున్నట్లు సమాచారం.

టాగ్ పరిమితి పొడిగింపు

భువనేశ్వర్: భారతీయ రైలు రాకపోకల సమగ్ర వేళల సంచిక ట్రైన్స్ ఎట్ ఎ గ్లాన్స్ (టాగ్) కాల పరిమితి పొడిగించారు. వాస్తవానికి ఈ ఏడాది జూలై 2024 ఈ సంచిక ముద్రణ మరియు పంపిణీ ప్రారంభం కావాల్సి ఉంది. రైల్వే బోర్డు తాజా నిర్ణయం మేరకు రైళ్ల రాకపోకల వేళల సరికొత్త సంచిక వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి రానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న టాగ్ ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు నిరవధికంగా కొనసాగుతుంది. తదనుగుణంగా చర్యలను నిర్ధారించాలని రైల్వే బోర్డు దేశ వ్యాప్తంగా రైల్వే వర్గాలకు ఉత్తర్వులు జారీ చేసింది.



కమ్మిన కరువు మేఘం..!

- రాష్ట్రంలో నామమాత్రంగా వర్షం
- పరిస్థితిని సమీక్షించిన రెవెన్యు మంత్రి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సురేష్ కుమార్ పూజారి

భువనేశ్వర్: రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా వాతావరణ పరిస్థితులు కలవరపరుస్తున్నాయి. ప్రధానంగా ఈ సీజన్‌లో అత్యధిక ప్రాంతాల్లో నామమాత్రంగా వర్షం కురిసింది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఖరీఫ్ నాట్లు ఇతరేతర సాగు స్థితిగతులను రాష్ట్ర రెవెన్యూ – విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి శనిఆవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత సాహు, స్థానిక వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్, వ్యవసాయం మరియు రైతు సాధికారత విభాగం డైరెక్టరు, ఒడిశా రాష్ట్ర విపత్తు నివారణ అధికార సంస్థ ఓస్డమా మేనేజింగు డైరెక్టరుతో సమావేశమయ్యారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో రెవెన్యూ శాఖ అధికారులు రాష్ట్రంలో వాతావరణ అంచనాలు, వాతావరణ హెచ్చరికలు, రుతుపవన సంబంధిత వివరాలు, జిల్లా స్థాయి వ్యవసాయం, బీమా తదితర అనేక అంశాలపై ప్రత్యేకంగా ఈ అధికారులతో చర్చించారు. జూలై నెలలో వీటి పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు.

రుతు పవనాల మందగమనం

రాష్ట్రంలో రుతు పవనాలు మందగమనంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 1 నుంచి 29 వరకు రాష్ట్రంలో సహజంగా సాధారణ వర్షపాతం 201.4 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటివరకు 141.3 మిల్లీ మీటర్లు వర్షం మాత్రమే కురిసింది. ఈ వ్యవధిలో నామమాత్రంగా ఒక జిల్లాలో మాత్రమే అధిక వర్షపాతం నమోదు అయింది. 10 జిల్లాల్లో సాధారణం, 2 జిల్లాల్లో భారీ లోటు వర్షపాతం రికార్డు అయింది. మిగిలిన 17 జిల్లాల్లో మొక్కుబడిగా వర్షం కురిసింది.

మల్కన్‌గిరి జిల్లాలో అధికం

ఈ సీజన్‌లో మల్కన్‌గిరి జిల్లాలో మాత్రమే అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. ఈ జిల్లాలో సాధారణం కంటే 21 శాతం అధికంగా వర్షం కురిసింది. ఈ ప్రాంతంలో సగటు వర్షపాతం 227.8 మిల్లీ మీటర్లు రికార్డు అయింది. ఈనెల 29 వరకు రాష్ట్రంలో సగటు వర్షపాతం సమగ్రంగా 141.3 మిల్లీ మీటర్లు నమోదయ్యింది. ఇది సాధారణం కంటే 30 శాతం తక్కువ కావడం విచారకరం.

గత 24 గంటల్లో అధికంగా వర్షం కురిసిన ప్రాంతాలు

ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
నయాగడ్	175.3
సోన్‌పూర్	143.0
కెంజొహర్	120.8
అంగుల్	109.0
బొలంగీరు	85.2
దేవ్‌గడ్	82.4
బర్‌గడ్	75.0
సుందరగడ్	65.2

కొరాపుట్, నవరంగపూర్, రాయగడ, కంధమల్, నయాగడ్, కటక్, జగత్‌సింగ్‌పూర్, ఢెంకనాల్, దేవ్‌గడ్, సోన్‌పూర్ 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయినట్లు వాతావరణ శాఖ వివరించింది. మయూర్‌భంజ్, బాలాసోర్ జిల్లాలో అతి తక్కువ వర్షపాతం నమోదు కావడం విచారకరం. మయూర్‌భంజ్ జిల్లాలో అత్యధికంగా 70 శాతం (78.8 మిల్లీ మీటర్లు) లోటు వర్షపాతం నమోదు కాగా బాలాసోర్ జిల్లాలో 66 శాతం (82 మిల్లీ మీటర్లు) వర్షం కురిసింది. మిగిలిన 17 జిల్లాల్లో సాధారణం కంటే 20 నుంచి 59 శాతం తక్కువ వర్షపాతం రికార్డు అయింది.

నాలుగు జిల్లాలకు హెచ్చరిక

రాష్ట్రంలో 4 జిల్లాలకు ఐఎండీ భారీ నుంచి అతి భారీ వర్షపాతం హెచ్చరిక జారీ చేసింది. కెంజొహర్, దేవ్‌గడ్, సుందర్‌గడ్ మరియు ఝార్సుగుడ సహా 4 జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. అయితే ఈ జిల్లాల కలెక్టర్లు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని విపత్తు నిర్వహణ విభాగం అప్రమత్తం చేసింది.

చేపల వేట నివారణ

వాయువ్య మరియు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపాను ప్రభావంతో ఉత్తర ఒడిశా తీరంలో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని ఐఎండీ సమాచారం. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని, చేపల వేట నివారించి సముద్రంలో ఉన్నవారు తిరిగి తీరానికి రావాలని ఐఎండీ హెచ్చరించింది. ఈనెల 30 ఆదివారం వరకు ఒడిశా తీరానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు బలం పుంజుకుంటాయి. మత్స్యకారులు ఈ వ్యవధిలో ఒడిశా తీరం మరియు వాయువ్య బంగాళా ఖాతంలో చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లవద్దని ఐఎండీ హెచ్చరికను జారీ చేసింది.

రథయాత్రకు ప్రత్యేక రైళ్లు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫుంక్వాల్

- తూర్పు కోస్తా రైల్వే జీఎం పరమేశ్వర్ ఫుంక్వాల్



భువనేశ్వర్: ఈ ఏడాది శ్రీజగన్నాథుని వార్షిక రథయాత్ర గుండిచా రెండు రోజుల పాటు కొనసాగుతుంది. మునుపటి రథయాత్ర ఉత్సవాల అనుభవం పరిగణన దృష్ట్యా తూర్పు కోస్తా రైల్వే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపాలని యోచిస్తోంది. జూలై 6 నుంచి 19వ తేదీ వరకు యాత్రికుల సౌకర్యార్థం శ్రీజగన్నాథుని రథయాత్ర సందర్భంగా పూరీకి రాను పోను ఉభయ దిశల్లో 315 ప్రత్యేక రైళ్లను నడపాలని యోచిస్తున్నారు. ఈ మేరకు తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫుంక్వాల్ పూరీ రైల్వే స్టేషన్‌లో రథయాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రథయాత్ర కంటే ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం బదంపహాడ్, రొర్కెలా, బాలేశ్వర్, సోన్‌పూర్, దసపల్లా, జునాగడ్ రోడ్, సంబల్‌పూర్, కెందుఝొరొగొడా, పారాదీప్, భద్రక్, అంగుల్, గుణుపూర్, బంగిరిపొషి నుంచి ప్రత్యేక రైళ్లను గుండిచా యాత్రకు నడపాలని దాదాపు ఖరారు చేశారు.

సంధ్యా దర్శనం ప్రత్యేకం

రథయాత్రలో ప్రత్యేక ఉత్సవాలను పరిగణనలోకి తీసుకుని యాత్రికుల సౌకర్యం కోసం అదనపు ప్రత్యేక రైళ్లు నడిపిస్తారు. ఈ నేపథ్యంలో సంధ్యా దర్శనం, బహుడా (మారు రథయాత్ర), స్వర్ణాలంకారం కోసం ప్రత్యేక రైళ్లను నడుపుతారు. ఈ ఏడాది తొలిసారిగా రథయాత్ర అంతిమ ఘట్టం ఒఢొరొ పొణా ఉత్సవం కోసం ప్రత్యేక రైలు రవాణా ఏర్పాటు కానుంది. రద్దీ మరియు భక్తుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రత్యేక రైళ్లను నడుపుతామని జనరల్ మేనేజరు తెలిపారు.

రిజర్వేషన్ సదుపాయం

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిపోయే ప్రయాణికుల సౌలభ్యం కోసం కొన్ని సుదూర ప్రత్యేక రైళ్లలో రిజర్వు బోగీలు కల్పిస్తారు. రథయాత్ర కాలంలో ప్రయాణీకుల సౌకర్యాలు మెరుగుపరచడంపై రైల్వే మంత్రిత్వ శాఖ నిబద్ధతతో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుంది. ప్రధానంగా రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతుంది. రైలు సమాచార వ్యవస్థ, విచారణ కౌంటర్లు, వీడియో వాల్స్ డిస్‌ప్లే, అదనపు టిక్కెట్ బుకింగ్ కౌంటర్లు మరియు మొబైల్ టికెట్ కౌంటర్లు, యాత్రికుల నిరీక్షణ ప్రాంతం, షెడ్ కోసం తూర్పు కోస్తా రైల్వే చొరవలను చేపట్టింది. 15 వేల మంది యాత్రికులు తలదాచుకునేందుకు వీలుగా సువిశాల షెడ్ ఏర్పాటు చేస్తారు. దీనిలో పూర్తి భద్రత, క్యాటరింగ్ మరియు ఆతిథ్యం, వైద్య సదుపాయాలు మరియు అంబులెన్స్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, పరిశుభ్రత మరియు మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు పుష్కలంగా కల్పించనున్నట్లు జనరల్ మేనేజరు వివరించారు.

మహాత్ముడికి నివాళులు



రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సీఎం మోహన్ చరణ్

భువనేశ్వర్: న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శనివారం రాజ్‌ఘాట్‌ని సందర్శించారు. ఈ ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. గాంధీజీ త్యాగం, ఎనలేని ధైర్యం ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. భారత దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి సమాధి దగ్గర సైతం పుష్పాంజలి ఘటించారు.

స్లాట్ బుకింగ్‌పై త్వరలో నిర్ణయం



క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

- న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయ రత్న భాండాగారం (ఖజానా) తెరవడం, భక్తులకు దర్శనం స్లాట్ బుకింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలియజేశారు. శనివారం ఆయన పూరీలో పర్యటించి, రథయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. గుండిచా యాత్ర 3 రథాలు నిలిపే ప్రాంతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి జిల్లా అధికార యంత్రాంగంతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఒకే రోజు మూడు ఉత్సవాలు జరగనుండటంతో రథయాత్రలో భక్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యాత్ర ప్రత్యక్షంగా తిలకించేందుకు పూరీకి రానున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని యాత్ర ఆద్యంతం క్రమశిక్షణతో జరిపేందుకు, పూర్తి స్థాయి ఏర్పాట్లను నిర్ధారించడానికి మంత్రి ప్రత్యక్షంగా పూరీ సందర్శించడం విశేషం.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు, భక్తులు ఆలయం లో పల దర్శనం కోసం ప్రతిపాదిత స్లాట్ బుకింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. ఈ మేరకు నిర్ణయం తీసుకునే ముందు అందరినీ విశ్వాసంలోకి తీసుకుంటామన్నారు. తాము నిర్ణయం తీసుకునే ముందు సేవకులు, అన్ని అనుబంధ వర్గాలు, ఈ విషయంలో అనుభవం ఉన్న పట్టణంలోని ప్రముఖ వ్యక్తులతో చర్చిస్తామని తెలియజేశారు. అయితే రథ యాత్ర తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆలయ రత్న భాండాగారం తెరవడంపై ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలిస్తోందని చెప్పారు. స్వామినిధిని తెరవడంతో పాటు, దానిలోని ఆభరణాలు ఇతరేతర సొత్తు మూల్యాంకనంతో లోపలి భాగంలో దెబ్బతిన్న ప్రాంతాల మరమ్మతు మరియు ఇతర అంశాలను లోతుగా సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలో రథయాత్ర సాగనున్న మార్గంలో ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని సందర్శించిన సందర్భంగా ట్రాఫిక్ పోలీసుల సహకారంతో వాహనాలు సాఫీగా వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రథయాత్రలో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో వచ్చే హెలిప్యాడ్‌ను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం శాంతి భద్రతలు మరియు రథ యాత్ర వివిధ అంశాలపై పూరీ కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వంయి, పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రాతో సమావేశం నిర్వహించారు.

మునిషిపాదొరాలో ఐసీఎంఆర్ వైద్య బృందం

- డిఫ్తీరియా వ్యాధిపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ



కొండలపై నడుచుకుంటూ వెళ్తున్న వైద్య బృందం

రాయగడ: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) న్యూఢిల్లీకి చెందిన ఐదుగురు వైద్య నిపుణులు మునిషిపాదొరా గ్రామంలో శనివారం పర్యటించారు. జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరా గ్రామంలో ఈనెల 6వ తేదీ నుంచి 11 తేదీ మధ్య ఐదుగురు చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. అంతుచిక్కని వ్యాధి బారినపడిన ఈ చిన్నారుల మృతిపై వైద్యులు తీవ్ర అందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వ్యాధిబారిన పడినవారి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించిన అనంతరం డిఫ్తీరియా వ్యాధిగా గుర్తించారు. ఈ వ్యాధి బారినపడిన దాదాపు 15 మంది చిన్నారులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వ్యాధి ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే వ్యాధి సంక్రమించడానికి గల కారణాలు అన్వేషించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయ (న్యూఢిల్లీ) ఆదేశాల మేరకు శుక్రవారం న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్ విభాగానికి చెందిన ఐదుగురు వైద్య నిపుణులు రాయగడకు చేరుకున్నారు. ఈ మేరకు జిల్లా ముఖ్య వైద్యాధికారితో సమావేశమై వ్యాధి తీవ్రత, మరణాలకు గల కారణాలకు సంబంధించి వివరాలను సేకరించారు. శనివారం ఐసీఎంఆర్ విభాగానికి చెందిన డాక్టర్ అశోక్ చక్రవర్తి, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ ఆరతి నంద, ఎపిడెమోలజీ స్పెషలిస్ట్ డాక్టర్ అరుణి ఘాయ్, సైంటిస్ట్ దేవేంద్ర భట్టాచార్యలు మునిషిపాదొరా గ్రామానికి చేరుకున్నారు.

కాలినడకన గ్రామానికి...

సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్య బృందం సుమారు 8 కిలోమీటర్ల మేర కాలినడకన మునిషిపాదొరా గ్రామానికి చేరుకున్నారు. డొంగాశిలి పంచాయితీలోని డిముర్కా గ్రామం నుంచి మునిషిపాదొరా గ్రామానికి చేరుకోవాలంటే కొండలు, గుట్టలు ఎక్కివెళ్లాల్సిందే. వైద్య బృందం అత్యంత శ్రమనొడ్చి అక్కడకు చేరుకున్నారు. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకుని కాలినడకను ప్రారంభించి సుమారు రెండు గంటల నడకతో గ్రామానికి చేరుకున్నారు.

గ్రామస్తులతో మాటామంతి



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం



చిన్నారిని పరిశీలిస్తున్న డాక్టర్ భట్టాచార్య

వ్యాధి బారినపడిన ఈ గ్రామంలోని గ్రామస్తులతో వైద్య బృందం సభ్యులు మాట్లాడారు. వ్యాధి లక్షణాలు ఎలా ఉన్నాయి అనే అంశంపై బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. మొదట వ్యాధి సోకినప్పుడు వ్యాధిగ్రస్తుడి ప్రవర్తన, అతనిలో కనిపించే వ్యాధి లక్షణాలకు సంబంధించి వివరంగా తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని కొందరి చిన్నారులను ప్రత్యేకంగా పరీక్షించారు. ఆదివాసీ భాష కావడంతో కొంత ఇబ్బందులు ఎదుర్కున్నా వివరాలను సేకరించారు. ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేశారు.

రక్తనమూనాల సేకరణ

గ్రామంలోని కొంతమంది చిన్నారుల రక్తాన్ని సేకరించిన వైద్య బృందం వారు తాగేనీరుని పరీక్షించారు. దాని నమూనాలను కూడా సేకరించి వారితో తీసుకెళ్లారు. అదేవిధంగా పర్యావరణం, పరిసర ప్రాంతాల్లో కలుషిత వాతావరణం మొదలగు వాటిపై అవగాహన ఏర్పాటు చేసుకున్నారు. చిన్నారులు ప్రస్తుతం ఎలా ఉన్నారు, వారిలో చురుకుతనం ఎలా ఉంది అన్న అంశాలను పరిశీలించారు.

20 ఏళ్ల తర్వాత వ్యాధి లక్షణాలు

డిఫ్తీరియా వ్యాధి సంక్రమణకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేసిన వైద్య బృందం, దాదాపు 20 ఏళ్ల తర్వాత ఈ వ్యాధి మళ్లీ సంక్రమించిందని అందుకు గల కారణాలను అన్వేషించేందకు వైద్య బృందం పర్యటించిందని డాక్టర్ దేవేంద్ర భట్టాచార్య తెలియజేశారు. డీపీటీ టీకాలు వేసినప్పటికీ చిన్నారులకు ఈ వ్యాధి సంక్రమించడానికి గల కారణాలను అన్వేషిస్తున్నామని, అందుకు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టిందని సమీప గ్రామాలకు వ్యాప్తి చెందకుండా జిల్లా ఆరోగ్య శాఖ సకాలంలో చర్యలు చేపట్టడం ఎంతో ఉపయోగకరమైందన్నారు. తమతోపాటు తీసుకుని వెళ్తున్న నమూనాలను పరీక్షించిన అనంతరం సమస్య ఒక కొలిక్కివస్తుందని దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టేవిధంగా జిల్లా ఆరోగ్య శాఖకు దిశానిర్దేశం చేస్తామని చెప్పారు .

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి


తులసి బోత్ర మృతదేహం

కొరాపుట్: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీస్‌స్టేషన్ పరిధి సిన్నాసి పోలీస్ అవుట్ పోస్ట్ సమీపంలోని బొరివట్ట గ్రామంలో కుషు బోత్ర కుటుంబం ఇంటిలో నిద్రిస్తుంది. ఇదే సమయంలో అతని భార్య తులసి బోత్ర (55) ఒక్క సారిగా కాలునొప్పితో కేకలు వేసింది. ఇంటిలో అందరూ లేచి చూడగా ఆమెకి సమీపంలో ఒక త్రాచుపాము ఉంది. వెంటనే వారు అప్రమత్తమై పాముని చంపారు. తులసికి కాలుపై పాముకాటు ఉండడంతో ఉమ్మర్ కోట్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె నురగలు కక్కుకుంటూ ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి పట్టివేత


గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 90 గ్రామం వద్ద శనివారం సాయంత్రం కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేశారు. బ్యాగుల్లో 22 కేజీల గంజాయిని గుర్తించి వారిని కలిమెల పోలీసుస్టేషన్‌కు తరలించారు. గంజాయి సుమారు రూ.30 లక్షలు విలువ చేస్తుందని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 3 సెల్ ఫోన్లు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణకు చెందిన వారని వెల్లడించారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు


ఆస్పత్రిలో చేరిన బాధితులు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రెండు రోజుల వ్యవధిలో సుమారు 11 మందిపై దాడిచేసినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. శనివారం ఆదిఆంధ్ర వీధిలో ఉంటున్న దాలయ్య అనే వ్యక్తి వీధిలో నడిచివెళ్తుండగా కుక్క దాడిచేసింది. తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎన్టీఆర్ కాలనీ, మండపాలం కాలనీ, పాతజాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడిచేస్తుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన జగన్

శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లి మిల్లు కూడలి సమీపంలో శనివారం వేకువ ఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శ్యామ్‌పాలెం గ్రామానికి చెందిన జగన్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న బాబ్జీ అనే ఆర్టీసీ ఉద్యోగి సపర్యలు చేశాడు. ఇంతలో జగన్‌కు కుటుంబసభ్యుల నుంచి ఫోన్ రావడంతో జరిగిన విషయాన్ని చెప్పాడు. కుటుంబసభ్యులు వచ్చి బాధితుడిని రిమ్స్‌కు వైతరలించారు.

రాష్ట్ర ఉషూ పోటీల్లో పతకాల పంట


పతకాలు సాధించిన ఉషూ క్రీడాకారులతో రెడ్డి శివకుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి జూనియర్ ఉషూ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. రాజమండ్రి వేదికగా ఈ నెల 27, 28 తేదీల్లో 10వ ఏపీ రాష్ట్రస్థాయి ఉషూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు మొత్తం ఏడు పతకాలతో సత్తాచాటారు. ఇందులో 6 బంగారు, ఒక కాంస్య పతకం ఉన్నాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను ఉషూ సంఘ ప్రతినిధులు అభినందించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


మాక్ డ్రిల్‌లో పాల్గొన్న పేపర్ మిల్ సిబ్బంది


మంటల నివారణను చూపిస్తున్న దృశ్యం


మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న అధికారులు

రాయగడ: పరిశ్రమల్లో తరచూ సంభవించే ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని జేకే పేపర్ మిల్ జనరల్ మేనేజర్ (ఈహెచ్‌ఎస్) సత్యజీత్‌మహంతి అన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తూ జేకేపేపర్ మిల్ రికవరీ ప్లాంట్ ఆవరణలో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదవశాత్తు ఫర్నేస్ ట్యాంక్‌లో మంటలు చెలరేగితే నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు వివరించారు. సుమారు గంట సమయం కొనసాగిన మాక్ డ్రిల్ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ అండ్ బాయిలర్స్ రాయగడ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ చిత్తరంజన్ బెహర, జాయింట్ డైరెక్టర్ వినిత్ కుమార్ షడంగి, రాయగడ జిల్లా అత్యవసర శాఖ అధికారి లలిత్ మండల్, జిల్లా ప్రాజెక్టు అధికారి జ్యోతిర్మయి పాత్రో, అగ్నిమాపక శాఖ అధికారి కైలాస్ చంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

‘సారా బట్టీల టెండర్లు రద్దు చేయాలి’


ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం/కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో దేశీ సారా బట్టీలకు, నాటు సారా దుకాణాలు తెరిచేందుకు టెండర్లు ఆహ్వానించే ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. ఒడిశాను సారా ముక్తి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ప్రకటనను తాను స్వాగతిస్తున్నానన్నారు. అయితే ప్రభుత్వం సారా నిలుపుదల చేస్తామని చెబుతుండగా, కొరాపుట్ జిల్లాలో 8 నాటుసారా బట్టీలు, నాటుసారా దుకాణాలు తెరిచేందుకు టెండర్లు పిలవడం దురదృష్టకరమన్నారు. మద్యం వలన యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సారా బట్టీలను నిలుపుదల చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం మద్యం దుకాణాలు, బార్‌లకు ఇష్టం వచ్చినట్లు లైసెన్స్‌లు ఇచ్చిందని అభిప్రాయపడ్డారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న నర్సింగ త్రిపాఠి

కొరాపుట్: నూతన న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నబరంగ్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్ర కోర్టుల సముదాయంలో చట్టాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన న్యాయ చట్టాలు జులై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో నూతన చట్టాలు అమలవుతాయన్నారు. ఇకపై నేర పరిశోధనలో సాంకేతక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఉపయోగం లేని కొన్ని చట్టాల తొలగించి, వాటి స్థానంలో తీసుకొచ్చిన నూతన చట్టాల్లో శిక్షల అమలు తీరులో మార్పులు ఉంటాయన్నారు. వీటిపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సదస్సులో బార్ అసోసియేషన్ కార్యదర్శి తపన్ సింగ్, ప్రసన్న పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొరాపుట్: ఖరీఫ్ సీజన్‌లో సమయానికి ఎరువులు దొరక్కపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాంలో నిరసన తెలిపారు. ప్రభుత్వ సహకార సంస్థ (ల్యాంప్స్) తమకు ఎరువులు అందజేయాల్సి ఉన్నా ఈ పని చేయలేదని వాపోయారు. ల్యాంప్స్ తన బాధ్యత నెరవేర్చకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఎరువుల విక్రయదారులు రేట్లు పెంచి విక్రయిస్తున్నారన్నారు. 90 శాతం రైతులు ఉండే డాబుగాం సమితిలో అత్యధికంగా గిరిజనులే ఉన్నారని గుర్తు చేశారు. తక్షణమే సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. మార్కెట్‌లో ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డాబుగాం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

గంజాయి వదిలి వ్యక్తి పరార్


పట్టుబడిన బైక్, గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: ఎక్సైజ్ అధికారులు వాహన తనికీలు నిర్వహిస్తుండడం గమనించిన ఒక వ్యక్తి గంజాయి వదిలి పరారైన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జయపురం ఎక్సైజ్ సిబ్బంది జయనగర్–బొయిపరిగుడ రోడ్డులోని బలియ జంక్షన్‌లో వాహన తనికీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒక బైక్‌పై అతి గంగా వస్తున్న ఒక వ్యక్తి వాహనాలు తనికీ చేస్తుండడం గమనించి కొంత దూరంలో బైక్‌ను వదిలి పారిపోయాడు. ఎక్సైజ్ సిబ్బంది అతనని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. వ్యక్తి విడిచిపెట్టిన బైక్‌ను ఎక్సైజ్ సిబ్బంది తనికీ చేయగా ఒక బస్తాలో గంజాయి బయటపడింది. గంజాయిని తూకం వేయగా 8 కేజీలు ఉందని, దాని విలువ రూ.80 వేలు ఉంటుందని ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

సేవలే గుర్తింపునిస్తాయి


పదవీ విరమణ సిబ్బందితో ఎస్పీ, అదనపు ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్: పోలీసులుగా ప్రజలకు మనం అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్న పోలీసు అధికారులు, సిబ్బందిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందేవారిలో ఎస్ఐలు ఎస్.కృష్ణయ్య, కె.మోహనరావు (పోలీస్ కంట్రోల్ రూం), ఎస్.ఎస్.పాణిగ్రాహి (ఏఆర్ ఎస్ఐ), పి.ఢిల్లీశ్వరరావు (ట్రాఫిక్ పీఎస్), ఏఎస్ఐ బి.నాగభూషణరావు (సీసీఎస్), హెచ్‌సీ బి.సంతోష్ (ఏఆర్), క్లాస్–4 ఉద్యోగి టి.రామారావు ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు త్రినాథరావు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో మహిళలపై దాడి

వజ్రపుకొత్తూరు రూరల్: ఆస్తి తగాదా ఘటనలో ఇద్దరి మహిళలపై వారి కుటుంబ సభ్యులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ఇచ్చాపురం మండలం గుళ్లలపాడులో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుళ్లలపాడు గ్రామానికి చెందిన వాసుదేవరావు మొదటి భార్య కుమార్తె ఐయిన మెళియాపుట్టి మండలం గోకన్నపురం గ్రామానికి చెందిన గుంట నీలమ్మకు 20 ఏళ్ల క్రితం తన కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఆస్తి పంపకాల్లో 45 సెంట్లు వాటాగా అందింది. అప్పటి నుంచి భూమిని సాగు చేస్తూ వచ్చింది.ఈ ఏడాది కుడా ఖరీఫ్ సాగులో భాగంగా శుక్రవారం విత్తనాలు వేస్తున్న నీలమ్మపై వజ్రపుకొత్తూరు మండలం గుళ్లలపాడు గ్రామానికి చెందిన వాసుదేవరావు రెండో భార్య కుమారుడు శిష్టి కృష్ణమూర్తి, భార్య శిష్టి పావని, కుమారుడు శిష్టి వంశీలు దాడి చేశారు. ఈ ఘటనలో నీలమ్మ తల, చేతిపై తీవ్ర గాయాలు కాగా కుమార్తె అరుణకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఐఎస్ఎఫ్ జవాన్‌కు నివాళులు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) ప్రసాద్ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ యారబాటి ప్రసాద్ (34) అనారోగ్యంతో శుక్రవారం చెన్నైలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శనివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ప్రసాద్ చెన్నైలో సీఐఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. నాలుగు రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. ప్రసాద్‌కు భార్య శూన్య కుమారి, కుమార్తెలు ధామిని, అనుష్క ఉన్నారని సోదరుడు, మాజీ సర్పంచ్ యారబాటి రాంబాబు తెలిపారు. ప్రసాద్ మృతి పట్ల పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సంతాపం తెలియజేశారు.

సీఎం మోహన్ చరణ్‌తో ఎంపీ బలభద్ర మజ్జి భేటీ


సీఎం, డిప్యూటీ సీఎంలతో ఎంపీ బలభద్ర మజ్జి

కొరాపుట్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడాలతో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మజ్జి సమావేశమయ్యారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం బృందాన్ని శుక్రవారం కలిసి నబరంగ్‌పూర్ పార్లమెంటరీ స్థానంలో ఉన్న సమస్యలును వివరించారు. రాష్ట్రంలో అత్యధిక వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వీరందరూ రాష్ట్రానికి చెందిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు.

త్వరలో పేపర్ లెస్ శాసనసభ

● స్పీకర్ సురమా పాఢి

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో పేపర్ లెస్ శాసనసభ ఆచరణలోకి వస్తుందని స్పీకర్ సురమా పాఢి తెలిపారు. రానున్న ఒకటి, రెండేళ్లలో ఒడిశా శాసనసభను పూర్తిగా డిజిటలైజేషన్ చేయబోతున్నట్లు తెలిపారు. జిల్లా సమాచార కేంద్రాల అధికారుల శిక్షణ కార్యక్రమంతో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ (నేవా) ఇప్పటికే ఒడిశా అసెంబ్లీ పూర్తి డిజిటలైజేషన్ కోసం ప్రక్రియను ప్రారంభించింది. అసెంబ్లీని పేపర్ లెస్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం 30 జిల్లా సమాచార కేంద్రాల (డీఐసీ) అధికారులు నేవా శిక్షణ కోసం భువనేశ్వర్ వచ్చారు. శిక్షణ సెషన్ రోజంతా కొనసాగుతుంది. నేవా ద్వారా కొత్త వారితో సహా శాసన సభ్యులందరికీ శిక్షణ ఇవ్వాలని యోచిస్తున్నట్లు స్పీకర్ వివరించారు.

☛ డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభం

గత అసెంబ్లీ సమావేశాల్లోనే డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఒకటి, రెండు సంవత్సరాల్లో అసెంబ్లీని పూర్తిగా డిజిటలైజ్ చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గత రెండేళ్లలో కొంతమేరకు ఈ చొరవ విజయవంతమైంది. శాసనసభ వ్యవహారాల్లో కనీస కాగితాన్నే వాడుతున్నారని ఆమె తెలిపారు. అప్‌గ్రేడ్ చేసిన యాప్‌తో కూడిన నేవా టాబ్లెట్ అందరు ఎమ్మెల్యేల టేబుల్‌లో ఇన్‌స్టాల్ చేయబడింది. సభ్యులందరినీ సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారిగా మార్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. కొత్త ప్రక్రియ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. నేవా దేశంలోని అన్ని శాసనసభలను ఒకే వేదికపైకి తీసుకురావడం, భారీ డేటా డిపాజిటరీని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. కాగిత రహిత (పేపర్ లెస్) అసెంబ్లీ లేదా ఈ-అసెంబ్లీ అనేది సభలో కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని అలవరుస్తుంది. ఇది మొత్తం చట్టం తయారీ ప్రక్రియ యొక్క ఆటోమేషన్, పత్రాల ట్రాకింగ్ మరియు సమాచారాన్ని భాగస్వామ్యం చేస్తుంది.

కొరాపుట్ జిల్లాలో ఆంత్రాక్స్ కలకలం


పొడయిగుడ గ్రామం

కొరాపుట్: జిల్లాలో ఆంత్రాక్స్ కలకలం సృష్టించింది. దేవిఘట్ గ్రామ పంచాయతీ పొడాయిగుడ గ్రామంలో ఇద్దరికి ఆంత్రాక్స్ సోకినట్లు వైద్యాధికారి ముక్తి కాంత్ ఖటువా ధ్రువీకరించారు. గ్రామంలో విందు భోజనంలో వందల మంది మాంసాహార భోజనం చేశారు. అనంతరం ఈ వ్యాధి వెలుగులోకి వచ్చింది. వెంటనే వైద్య బృందాలు బాధిత గ్రామానికి వెళ్లి ఇంటింటా సర్వే చేశారు. సుమారు 400 మందిని పరిశీలించగా ఆరుగురికి లక్షణాలు కనిపించాయి. వారి రక్త నమూనాలు భువనేశ్వర్ పంపగా అందులో ఇద్దరికి ఆంత్రాక్స్ నిర్ధారణ అయ్యింది. బాధితులను మదలాపుట్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ వైద్య కళాశాలకి తరలించి ఐసోలేషన్‌లో ఉంచారు. వైద్య అధికారులు ప్రజలకు మందులు అందజేసి, ఎటువంటి పరిస్థితుల్లోనూ చనిపోయిన పశువులను ఖననం చేయాలన్నారు. వాటి మాంసం తినడం వలన ఆంత్రాక్స్ వస్తుందని అవగాహన కల్పించారు.

నిర్మాణ సామగ్రి దొంగల అరెస్టు


అరెస్టైన దొంగలను చూపిస్తున్న పోలీసులు

జయపురం: రూరల్ వాటర్ సప్లయ్ విభాగం కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను బొయిపరిగుడ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వారు బొయిపరిగుడ సమితి కొల్లార గ్రామానికి చెందిన భగవాన్ మహాపాడియ, టిటు కర్లియగా పోలీసులు వెల్లడించారు. వారి వద్ద నుంచి ఒకటిన్నర మీటర్ల 34 కప్‌లాక్‌లు, ఒక సెల్ఫ్ క్లాంప్, అర మీటర్ పొడవు గల 25 యూ షేప్ జాక్‌లు, ఒక మీటర్ పొడవు 14 కప్ లాక్‌లు, 8 స్పిగాట్లు, 1.5 మీటర్ల పొడవు ఉన్న ఒక కప్ లాక్, 1.5 మీటర్ల పొడవు హారిజెంటర్ లెడ్జర్‌లు 9, 1.2 మీటర్ల పొడవు హారిజెంటర్ లెడ్జర్‌లు 4 స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలకు పైనే ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఆ సామాన్లు తీసుకెళ్లేందుకు ఉపయోగించిన ఆటోని సీజ్ చేశామన్నారు. ఈనెల 26వ తేదీన బొయిపరిగుడ సమీప బీరకంబ టెంపుల్ సైట్ నుంచి సామగ్రి దొంగతనానికి గురవ్వడంతో రూరల్ వాటర్ సప్లయ్ విభాగ అడ్మినిస్ట్రేట్ మేనేజర్ దిలీప్ కుమార్ స్వైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న విశాఖపట్నం సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ శైలజ. పక్కనే ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : భారతీయ నూతన చట్టాలు జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో కొత్త చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులకు నూతన చట్టాలపై విశాఖపట్నం సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఎం.శైలజ అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్ 2023), భారతీయ నాగరిక్ సురక్ష సంహితా (బీఎన్ఎస్ఎస్ 2023), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) అనే కొత చట్టాలు అమల్లోకి రానున్నాయన్నారు. వీటిపై పోలీసు అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త, పాత చట్టాలలో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా వివరించి సందేహాలను నివృత్తి చేశారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పెంచుకుని బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్టు, వాంగ్మూలం, నమోదు, దర్యాప్తులో పాటించాల్సిన జాగ్రత్తలు, చార్జిషీటు ఎలా తయారు చేయాలి, కేసుల ట్రయల్ సమయంలో దర్యాప్తు అధికారులు శిక్షల శాతం పెరిగేలా వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు వివరించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణా పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు వై.శృతి, శివరామిరెడ్డి, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిక్ బాక్సింగ్‌తో సత్య కళాశాల విద్యార్థి సత్తా



విజేతను అభినందింస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్యే కప్ మొదటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అమెచ్యూర్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలలో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి కె.కృష్ణభగవాన్ రజిత పతకం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, పార్వతీపురం అమెచ్యూర్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. విజేతను స్థానిక కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఫిజికల్ డైరెక్టర్ పి.మహేశ్వరావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సాలూరు రూరల్ : మండలంలోని శివరాంపురం వద్ద వేగావతి నది ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఈబీ అధికారులు శనివారం సీజ్ చేశారు. అనంతరం వాహనాలను రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ వాహన డ్రైవర్లు బుస నరేంద్ర, కనకల మణికంఠలపై కేసు నమోదు చేశారు.

నోట్ పుస్తకాలు విక్రయించే స్కూళ్లపై చర్యలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు మినహా ఇతర పుస్తకాలు విక్రయించే ప్రైవేటు స్కూళ్ల యాజమన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ఎస్.ప్రేమకుమార్ శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వానికి 5 శాతం రుసుం చెల్లించి నిర్దేశించిన విక్రయశాలల్లో కొనుగోలు చేసిన పుస్తకాలు మినహా మరే పుస్తకాలను విద్యార్థులకు విక్రయించరాదని స్పష్టం చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం టౌన్ : లైజాల్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సీతానగరం మండలం చినబోగిలి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన స్వాతికి ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. ఆమె భర్త విజయవాడలో ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన స్వాతి ఇంట్లో ఉన్న లైజాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యాసిడ్ తాగి మరో మహిళ ..

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బలిజిపేట మండలం పి.రాయివలస గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరి భర్త నిత్యం మద్యం తాగి వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన గౌరి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 3వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులను ప్రిన్సిపాల్‌కు అందజేయాలన్నారు. పీహెచ్‌డీ, సెట్ అర్హతలున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామానికి చెందిన నక్కెల్ల గోపి (40) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పెదమానాపురం పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ కాశీరావు తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కొద్దిరోజుల కిందట గోపి కాలుకు గాయమైంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 27వ తేదీన ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి గోపిని గజపతినగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా... అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఉద్యోగాలకు 33 మంది ఎంపిక

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లిలోని తాండ్రపాపారాయ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో తునిలోని డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ఉద్యోగాలకు 33 మంది ఎంపికయ్యారని కరస్పాండెంట్ తూములభాస్కరరావు శనివారం తెలిపారు. జాబ్‌మేళాకు 106 మంది విద్యార్థులు హాజరుకాగా రాతపరీక్షలో 64 మంది అర్హత సాధించారన్నారు. వీరికి ఇంటర్వ్యూ నిర్వహించగా ఉద్యోగాలకోసం 33 మంది ఎంపికైనట్టు వెల్లడించారు. హెచ్ఆర్ మేనేజర్ కె.ఫణిశశాంక్, కంపెనీ ప్రతినిధి ఎం.గాయత్రి ఇంటర్వ్యూ నిర్వహించారు.

యాప్‌లతో వ్యవసాయానికి ఊతం..

- సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారం
- వాతావరణం తెలుసుకునే వెసులుబాటు
- పిడుగులు, వర్షాలు, తుఫాన్‌లపై ముందస్తు సమాచారం

పార్వతీపురం:

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుత ప్రగతి సాధించడంతో మనిషి మనుగడకు అవసరమైన అనేక ప్రయోజనాలు అరచేతిలోకి వచ్చేశాయి. పూర్వం వాతావరణ సమాచారాన్ని తెలుసుకోవాలంటే అసాధ్యమనే చెప్పాలి. నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ముందుగానే వాతావరణ పరిస్థితులను తెలుసుకునే సౌలభ్యం వచ్చింది. చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు.. ప్రపంచాన్నే కాదు.. అంతరిక్షాన్ని సైతం చుట్టేసే ఆధునిక యుగంలో ఉన్నాం. వర్షం కోసం ఆకాశం వైపు చూడడం మాని, సెల్‌ఫోన్‌లోని యాప్స్‌ను అడిగితే చాలు. ఒక రోజు కాదు, వారం రోజుల సమాచారాన్ని సైతం అందిస్తుంది. ఇక రైతాంగానికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు నేడు అనేక యాప్స్ సెల్‌ఫోన్‌లో అందుబాటులోకి రావడంతో రైతన్నకు మేలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయి.

అనేక సవాళ్లు..

వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి సాగునీరు అత్యవసరం. విత్తు నాటడం మొదలు పంట విక్రయాల వరకు రైతన్నకు అడుగడుగునా అనేక సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. వీటిలో ప్రధానం వాతావరణ పరిస్థితులు. నిత్యం గమనిస్తూ వాతావరణానికి అనుగుణంగా పంటలు వేసుకోవడం.. ఎరువులు, నీటి తడులు అందించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వాతావరణ పరిస్థితులు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక యాప్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వర్షాలు, పెనుగాలులతో అనేక సార్లు అన్నదాతలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటారు. ఇక పిడుగు పాటుకు అటు రైతులు, గొర్రెల కాపరులతో పాటు సాధారణ ప్రజలు సైతం మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయానికి ఉపయోగపడేలా తీసుకువచ్చిన యాప్స్ ఎంతో ఉపయోగకరంగా మారాయని చెప్పక తప్పదు.



వజ్రపాత్ యాప్



రెయిన్ అలారం యాప్



మేఘదూత్ యాప్

మేఘదూత్..

విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం వరకు రైతన్నకు ఎంతో కీలకం. వాతావరణ పరిస్థితులు ఏమాత్రం సహకరించకపోయినా తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ఇలాంటి నష్టాల నుంచి రైతులను బయటపడేందుకు మేఘదూత్ యాప్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. వారం ముందుగానే వాతావరణంలో మార్పులు, వర్షపు సూచనలతో సహా ఆకాశం మేఘావృతం అవుతుందా, లేదా అనే అంశాలతో పాటు గాలుల దిశలను సైతం తెలియజేస్తుంది. అలాగే వాతావరణంలో తేమశాతం, ఉష్ణోగ్రతల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

రెయిన్ అలారం యాప్..

గూగుల్ ప్లే స్టోర్‌లో రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా మనం నివసించే ప్రాంతానికి సుమారు 20 కిలో మీటర్ల పరిధిలో ఎక్కడ వర్షం పడే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

వజ్రపాత్ యాప్..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి వజ్రపాత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమవైపు పిడుగుపాటు సమాచారం కనిపిస్తాయి. అక్కడ నొక్కితే మనం ఉండే ప్రాంతంలో సహా పూర్తి మ్యాప్ ఫోన్‌లో కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్‌లో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల మేరకు ఎంత దూరంలో పిడుగుపడే అవకాశం ఉందో గుర్తించే అవకాశం ఉంటుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది.

ముందుగానే జాగ్రత్త పడవచ్చు..

రైతులతో పాటు ప్రజలకు సైతం అతిసులువుగా వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు. శాస్త్ర, సాంకేతిక రంగంలో అనేక నూతన ఆవిష్కరణల నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను నిత్యం గమనించేందుకు అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలు వేసుకోవడం, పురుగు మందులు పిచికారీ చేయడం, రసాయన ఎరువులు వినియోగించే సమయంలో వర్షం కారణంగా నష్టపోయే ప్రమాదం ఉంది. యాప్‌ల ద్వారా వర్షపు సూచనలు తెలుసుకుని ముందుగానే జాగ్రత్త పడవచ్చు. అదేవిధంగా పిడుగుపాటుకు గురికాకుండా ముందస్తు సమాచారంతో ఆ ప్రాంతానికి దూరంగా వెళితే ప్రాణం రక్షించుకోవడంతో పాటు పశుసంపదను సంరక్షించుకోవచ్చు.



– కె.రాబర్ట్ పాల్,
జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

- కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి

విజయనగరం రూరల్: ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి అన్నారు. విజయనగరం మండలం కోరుకొండ సైనిక పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి, ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్న సి.వరదరాజుకు వీడ్కోలు సభను సైనిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ ఎంతో మంది భావిభారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయ వృత్తిలోనే లభిస్తుందన్నారు. గణిత ఉపాధ్యాయునిగా చేరిన వరదరాజు తన వృత్తి ధర్మంలో చేసిన సేవలకు ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిగా 12 ఏళ్ల విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడికి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ కిరణ్, పరిపాలనా అధికారి, లెఫ్టినెంట్ కమాండర్ అభిలాష్ బాలచంద్రన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



ఉపాధ్యాయుడు వరదరాజుకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి

అంకితభావం, క్రమశిక్షణే స్ఫూర్తి



ఉద్యోగవిరమణ చేసిన వారితో ఎస్పీ ఎం.దీపిక, అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

- ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్ : విధి నిర్వహణలో మీరు కనబరిచిన క్రమశిక్షణ, అంకితభావమే ఇతర ఉద్యోగులకు స్ఫూర్తి అని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. పోలీస్ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన బొబ్బిలి ఎస్సై చదలవాడ సత్యనారాయణ, బొబ్బిలి ట్రాఫిక్ ఎస్సై వీబీ రామకృష్ణారావు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఎస్.షణ్ముఖరావు, కమ్యూనికేషన్ ఎస్సై ఆర్.సత్యం, పోలీస్ కంట్రోల్ రూం ఏఎస్సైలు షేక్ జిలానీ, పి.అరుణకుమారి, కొత్తవలస ఏఎస్సై పి.రాజులు, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై నాగరాజు, ఏఆర్ హెచ్‌సీ ఎ.వీరభద్రరాయుడు, పోలీస్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ ఎం.పైడిరాజులను శనివారం స్థానిక పోలీస్ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీ యానివర్స్, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ. నరసింహమూర్తి, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, కంట్రోల్ రూమ్ సీఐ రాజశేఖరరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, భగవాన్, రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

80 వసంతాల వేడుకను జయప్రదం చేయండి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సదాశివరావు

నెల్లిమర్ల: జిల్లా కేంద్రం విజయనగరంలో అక్టోబర్‌లో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.కృష్ణ తదితరులతో కలిసి నెల్లిమర్ల పట్టణంలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను ఆయన శనివారం కలిశారు. ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు, 20వ విద్యా వైజ్ఞానిక సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ సదస్సులో చర్చిస్తామన్నారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మూడు రోజుల పాటు నిర్వహించే సభల్లో పాల్గొనాలని సదాశివరావు కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.పైడిరాజు, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీదేవి, మండల కమిటీ అధ్యక్షుడు ఉంద్రు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

మెరుగైన విద్యాబోధనే లక్ష్యం



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ మంజులవాణి

- జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మంజుల వీణ

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నదే ప్రధాన లక్ష్యమని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మంజుల వీణ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఎస్టీ)ను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకుల విద్యాబోధన తీరుపై ఆరా తీశారు. అడ్మిషన్ల ప్రక్రియను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్యాబోధన చేపట్టాలని, విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా అవగాహనాయుత విద్యను అందించాలన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ ఉన్నారు.

ఉద్యోగాలకు 170 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ భాస్కరరావు

రాజాం సిటీ : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీలకు చెందిన ఉద్యోగాలకు 170 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి. భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూళ్లూరుపేటకు చెందిన టీవీఎస్ సుందరం, బ్లూస్టార్, ఏషియన్ ఆటో పార్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కికువా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నానికి చెందిన యోకుహయా, ఎస్ఎస్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీల ప్రతినిధులు 331 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, 170 మందిని ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, ఉపాధి అధికారి డి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం...

ఐటీఐలో రెండో విడత మిగులు సీట్ల భర్తీకి వివిధ ట్రేడులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25వ తేదీన అభ్యర్థులు తమకు దగ్గరలోఉన్న ఐటీఐలో ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, టీసీ, పాస్‌పోర్టుసైజు ఫొటో, ఆధార్ లింక్డ్ ఫోన్ నంబర్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అలాగే 27న ప్రభుత్వ ఐటీఐలో జరగనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 90000 96048, 83094 38446, 99595 02238, 90520 85679 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డీఎస్సీ ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ

- ఏపీ స్టడీ సర్కిల్ (బీసీ) డైరెక్టర్ సందీప్‌కుమార్



కె.సందీప్‌కుమార్

విజయనగరం అర్బన్: ఏపీ బీసీ సంక్షేమశాఖ ఆదేశాల మేరకు డీఎస్సీ ఎస్జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ స్టడీ సర్కిల్ (బీసీ) డైరెక్టర్ కె.సందీప్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 10 తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రెండు లక్షల లోపు ఉండాలని, ఎంపికై న అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులకు వచ్చే నెల 1 నుంచి 8వ తేదీలోగా విజయనగరం మున్సిపల్ కస్పా హైస్కూల్‌లోని స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టెట్ హాల్ టికెట్, బ్యాంక్ బుక్ జెరాక్స్, పాస్ ఫొటోలు-2 దరఖాస్తుతో జతచేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 96035 57333, 63015 30356 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!

- అధ్వానంగా పార్వతీపురం – కూనేరు రోడ్డు
- వరుస ప్రమాదాలతో బెంబేలెత్తిపోతున్న వాహన చోదకులు

కొమరాడ : పార్వతీపురం నుంచి కూనేరు వరకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులేర్పడడంతో రాకపోకలకు ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గోతుల్లో నీరు చేరడంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. అంతర్రాష్ట్ర రహదారిపై గుమడ వద్ద భారీ గోతిలో నీరు చేరిపోవడంతో పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే మాంగనీస్ లారీ శనివారం ఉదయం గోతిలో కూరుకుపోయింది. దీంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే కూనేరు సమీపంలో లారీని తప్పించబోయి బస్సు గోతిలో కూరుకుపోయిన సంఘటన కూడా శనివారం చోటుచేసుకుంది. దీంతో అక్కడ కూడా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న ప్రతిసారీ ఆర్అండ్‌బీ అధికారులు వచ్చి కొలతలు తీస్తున్నారే తప్ప, మరమ్మతులు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



గుమడ వద్ద గోతిలో పడి తిరగబడిన లారీ



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



కూనేరు సమీపంలో గోతిలో దిగబడిన బస్సు

క్షేత్రస్థాయి పరిశీలన

శృంగవరపుకోట: సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్న వేళ ఆర్డీఓ సూర్యకుమారి ఎస్.కోట మండలంలోని దబ్బగుంట గిరిజన గ్రామాన్ని శనివారం సందర్శించారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి పథకాల క్లోరినేషన్, వైద్యశిబిరాల నిర్వహణపై దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. అంతకు ముందు ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



దబ్బగుంట గిరిజన గ్రామాన్ని సందర్శిస్తున్న ఆర్డీఓ సూర్యకుమారి, తదితరులు

రామతీర్థంలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లాకు చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో చేపట్టిన భక్తి భజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రామక్షేత్రానికి విచ్చేసి స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.



వెండి మంటపం వద్ద పూజలు జరిపిస్తున్న అర్చకస్వాములు

కూరగాయల ధరలకు రెక్కలు

- కిలో టమాటా 100 రూపాయలు
- కిలో ఉల్లిపాయలు రూ. 50

మెరకముడిదాం: కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజుల కిందట వరకు మోస్తారుగా ఉండే ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఏం కొనాలి.. ఏం తినాలని తలలు పట్టుకుంటున్నారు. గతంలో 20 రూపాయలు ఉంటే కిలో టమాటా ఇప్పుడు ఏకంగా 100 రూపాయలు పలుకుతోంది. అలాగే నిత్యావసర వస్తువుల్లో భాగమైన ఉల్లిపాయల ధర కూడా ఒక్కసారిగా పెరిగిపోయింది. గతంలో రూ. 18 నుంచి 20 రూపాయలు ఉండే ఉల్లి నేడు 50 రూపాయలకు చేరుకుంది. అలాగే క్యాబేజీ, దొండకాయలు, బెండకాయలు అరవై రూపాయలకు పైగానే పలుకుతున్నాయి. వంకాయలు కిలో 50 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నారు. కొండెక్కిన కూరగాయల ధరలను చూసి సామాన్యులు ముక్కున వేలేసుకుంటున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు